క్లుప్తంగా

సహకార బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్‌: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ అన్నారు. మహబూబ్‌నగర్‌ జిల్లా సహకార బ్యాంకు లిమిటెడ్‌ పరిధిలోని షాద్‌నగర్‌ సహకార బ్యాంకు రూ.100కోట్ల టర్నోవర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మన్‌ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సహకార బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. సహకార బ్యాంక్‌లు డిపాజిట్లను పెంచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. భవిష్యత్‌లో బ్యాంకు అభివృద్ధికి సహకారాలు అందిస్తామన్నారు. సహకార బ్యాంకులు అందించే రుణాలను ప్రజలు క్రమం తప్పకుండా చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, సహకార బ్యాంకు డైరెక్టర్లు బక్కన్నయాదవ్‌, మంజులరెడ్డి, జగదీశ్వర్‌, అశోక్‌, దామోదర్‌రెడ్డి, బ్యాంకు నోడల్‌ ఆఫీసర్‌ దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

షాద్‌నగర్‌రూరల్‌: జాతీయ ఆహార భద్రత మిషన్‌ పథకం కింద జాతీయ విత్తన కార్పొరేషన్‌ ద్వారా అందించే రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్‌ అన్నారు. మంగళవారం ఏఓ నిషాంత్‌కుమార్‌ విలేకరులతో మాట్లాడుతూ.. యాసంగి సీజన్‌ కోసం ప్రభుత్వం జాతీయ విత్తన కార్పొరేషన్‌ ద్వారా డెమో కోసం సబ్సిడీ కింద పూలే సుచిత్ర రకం తెల్లజొన్నలను అందిస్తుందన్నారు. ఒక బ్యాగులో నాలుగు కిలోల తెల్లజొన్న విత్తనాలు ఉంటాయని, ఒక రైతుకు వంద కిలోల జొన్న విత్తనాలను ఇస్తామన్నారు. ఒక బ్యాగు 260 రూపాయలు ఉండగా, ప్రభుత్వం సబ్సిడీ కింద 140 రూపాయలకే రైతులకు అందజేస్తుందన్నారు. సాధారణ విత్తనాల కింద 21 క్వింటాళ్ల జొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. తెల్లజొన్న విత్తనాలపై ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతన సంవత్సర క్యాలెండర్‌ ఆవిష్కరణ



క్యాలెండర్‌ ఆవిష్కరిస్తున్న తహసీల్దార్‌, ఓంశాంతి సభ్యులు

చేవెళ్ల: ఓంశాంతి ద్వారా ప్రజలకు దైవచింతన, ధ్యానంపై అవగాహన కల్పించే మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తహసీల్దార్‌ కృష్ణయ్య అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్‌ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్‌ కృష్ణయ్య ఆధ్వ ర్యంలో చేవెళ్ల ఓంశాంతి వారి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్‌, ఓంశాంతి సభ్యులు పాండు, బాల్‌రెడ్డి, శశికళ తదితరులు ఉన్నారు.

జీవిత బీమాతో కుటుంబానికి ధీమా..

ప్రతి వ్యక్తికి జీవిత బీమా ఉంటే ఆ కుటుంబానికి ధీమా అందిస్తోందని ఎల్‌ఐసీ ఏజెంట్‌ నాగుల శంకర్‌ గురుప్రసాద్‌ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం చేవెళ్ల ప్రెస్‌క్లబ్‌ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చేవెళ్ల ప్రెస్‌క్లబ్‌ సభ్యులు గోపాల్‌, రాజేశ్‌, మధు, రాకేశ్‌, రాజశేఖర్‌రెడ్డి, సుభాశ్‌రెడ్డి, శ్రీనివాస్‌, ప్రవీణ్‌, రమేశ్‌, సలీం, యాదయ్య, రమేశ్‌, సత్యం, నరేందర్‌, సీపీఐ జిల్లా కార్యదర్శి కె.రామస్వామి, బీజేపీ మండల కార్యదర్శి ఎ.అనంత్‌రెడ్డి, మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ జనార్ధన్‌, మాజీ డైరెక్టర్‌ యాదగిరి, నాయకులు ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

తుక్కుగూడ: తుక్కుగూడ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాములుపై అయ్యప్ప భక్తుల ముసుగులో కొందరు భౌతికంగా దాడిచేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి గోవిందు, కేవీపీఎస్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌లు అన్నారు. మంగళవారం హెచ్‌ఎంను ఇరువురు నాయకులు వేరువేరుగా పరామర్శించి మాట్లాడారు. అయ్యప్ప మాలధరించిన విద్యార్థిని హెచ్‌ఎం చేయి తగిలిందని తెలిపారు. దీంతో హెచ్‌ఎం కావాలనే విద్యార్థిని కాలుతో తన్నాడనే ఆరోపిస్తూ దాడికి పాలుపడటం అన్యాయమన్నారు. దళితుల ఉద్యోగులపై దాడులు చేస్తే సహించమన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సామేల్‌, జగన్‌, సత్తయ్య, నర్సింహ, దాసు, సరోజ పాల్గొన్నారు.

కాన్పుల సంఖ్య పెంపునకు కృషి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్‌: ప్రభుత్వ ఆస్పత్రులలో కాన్పుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్‌ విజయలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్‌ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, హెల్త్‌ సూపర్‌వైజర్లు, డీఈఓలు, ఏఎన్‌ఎంలతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్‌ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గర్భిణులను గుర్తించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వారి ప్రసవ సమయాలను తెలియజేయాలని సూచించారు. గర్భిణులు కాన్పు కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. రెండు సంవత్సరాల వయసు ఉన్న పిల్లలందరికీ తప్పకుండా వ్యాక్సిన్‌ వేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని సూచించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించడంతో పాటుగా ప్రతినెల వారి ఆరోగ్య వివరాలను పరిశీలించాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 30 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి బీపీ, షుగర్‌ పరీక్షలు చేయాలని, బీపీ, షుగర్‌ ఉన్న రోగులకు ప్రతినెల మందులను అందజేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని హెల్త్‌ సూపర్‌వైజర్లు నెలవారీగా రిపోర్టులను జిల్లా వైద్యాధికారులకు అందజేయాలని సూచించారు. సమావేశంలో వైద్యాధికారులు హరికిషన్‌, రాఘవేందర్‌, స్రవంతి, అమృతజోసఫ్‌, నికిత, హెల్త్‌ ఎడ్యుకేటర్‌ శ్రీనివాసులు, హెల్త్‌ సూపర్‌వైజర్లు, డీఈఓలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడి కోసం నిరీక్షణ

టంగటూరు పీహెచ్‌సీలో రోగుల పడిగాపులు



వైద్యుడు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీ

శంకర్‌పల్లి: మండలంలోని టంగటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సమయానికి వైద్యుడు రాకపోవడంతో రోగులు అవస్థలు పడ్డారు. ఉదయం 9 గంటలకు రావాల్సిన వైద్యుడు 10.30వరకు రాకపోవడంతో పలువురు రోగులు పీహెచ్‌సీకి వచ్చి తిరిగివెళ్లారు. దీనిపై కలెక్టర్‌, వైద్యాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఇప్పటివరకు అధికారులు పీహెచ్‌సీని తనిఖీ చేయకపోవడమే వైద్యుల నిర్లక్ష్యానికి కారణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పీహెచ్‌సీ డాక్టర్‌ శ్రీనివాస్‌ని వివరణ కోరగా.. తాను శంకర్‌పల్లి పట్టణంలో నిర్వహించే ఇస్తేమా కార్యక్రమంలో విధులు నిర్వర్తిస్తున్నానని, పీహెచ్‌సీలో మరో ఇద్దరు సిబ్బందిని నియమించానన్నారు. వారికి సకాలంలో రవాణా సదుపాయం లేకపోవడంతో రావడానికి ఆలస్యమైనట్లు స్పష్టం చేశారు.



ఆస్పత్రిలో వేచి ఉన్న రోగులు



స్వయంపాలనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ చంద్రశేఖర్‌ హాజరై ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

ఎంపీడీఓ సంధ్య



ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్‌రూరల్‌: ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ సంధ్య సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలో అధికారులు నిర్వహిస్తున్న ఇళ్ల సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిరుపేదలకు సొంత ఇంటి కళను నిజం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందన్నారు. ఇంటి కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి పేర్లతో ప్రభుత్వం లిస్ట్‌ పంపించిందని, ఆ లిస్ట్‌లో ఉన్న వారి వివరాలు సేకరిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇంటి సర్వేను పారదర్శకంగా చేపట్టాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సర్వేను పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. ఆన్‌లైన్‌ నమోదులో ఎలాంటి తప్పులకు తావివ్వకుండా సర్వేపూర్తి చేయాలన్నారు. మొయినాబాద్‌ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 14,876 దరఖాస్తులు రాగా అందులో ఇప్పటివరకు 13,577 దరఖాస్తుల పూర్తి వివరాలను ఈ రోజు వరకు నిర్వహించామని ఆమె తెలిపారు. మండలంలో 91.27 శాతం సర్వే పూర్తయిందని పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం



షాద్‌నగర్‌: జెండా ఆవిష్కరిస్తున్న సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌



చేవెళ్లలో జెండా ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌

షాద్‌నగర్‌: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎఫ్‌ఐ రాజీలేని పోరాటం చేస్తోందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌ అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ 55వ ఆవిర్భావ వేడుకలను మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రతిభ జూనియర్‌ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి శ్రీకాంత్‌ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటాలను చేస్తూ దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎస్‌ఎఫ్‌ఐ అవతరించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయినా నేటివరకు విద్యాశాఖ మంత్రి లేకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వాలు విద్యారంగాన్ని అభివృద్ధి చేసేందుకు బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని డిమాండ్‌ చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ముకీద్‌, సమురాయ్‌, షైబాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

చేవెళ్ల: దేశంలో విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్‌ఎఫ్‌ఐ అలుపెరుగని పోరాటం చేస్తూ అగ్రగామి విద్యార్థి సంఘంగా ఎదిగిందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి శంకర్‌ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆవిర్భావ వేడుకలను జెండా ఆవిష్కరించి ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని భగత్‌సింగ్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు దేవేందర్‌, చేవెళ్ల డివిజన్‌ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్‌, అరుణ్‌కుమార్‌, మండల అధ్యక్షుడు సమీర్‌, కార్యదర్శి చందు, మొయినాబాద్‌ మండల అధ్యక్షుడు చరణ్‌గౌడ్‌, కార్యదర్శి తేజ, నాయకులు నవీన్‌, శివ, సందీప్‌, సాయి, చరణ్‌, సిద్ధు, ప్రవీణ్‌, సంతోష్‌, సౌమ్య, శ్రావణి, మమత, అమూల్య, గాయత్రి, సంధ్య, లావణ్య, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

‘కొత్త’ సందడి

2024కు వీడ్కోలు చెబుతూ.. 2025 నయా సాల్‌కు స్వాగతం పలుకుతూ నియోజకవర్గ ప్రజలు సంబరాల్లో మునిగితేలారు. మంగళవారం అర్ధరాత్రి కాగానే కేరింతలు కొడుతూ కేక్‌లు కట్‌ చేశారు. దీంతో బేకరీలు, మిఠాయి దుకాణాలు, రంగుల దుకాణాల్లో కొనుగోళ్లతో సందడి కనిపించింది.



చేవెళ్లలోని ఓ బేకరీలో వేడుకల కోసం సిద్ధం చేసిన కేక్‌లు



మొయినాబాద్‌లో కేక్‌లు కొంటున్న ప్రజలు

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్‌గుప్తా



షాద్‌నగర్‌: నూతన కమిటీ సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న వెంకటేశ్‌గుప్తా



కొందుర్గు: బూత్‌ కమిటీ సభ్యులకు నియామకపత్రాలు అందిస్తున్న భూపాలచారి

షాద్‌నగర్‌: గ్రామస్థాయిలో పార్టీని పటిష్టం చేసి, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు సత్తాచాటాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్‌ మండలం చించోడ్‌ గ్రామంలో ఉన్న రెండు పోలింగ్‌ బూత్‌లకు పార్టీ నూతన అధ్యక్షులుగా వెంకటేశ్‌, రుస్తుం శ్రీశైలంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశానికి వెంకటేశ్‌గుప్తా హాజరై మాట్లాడుతూ.. దేశాభివృద్ధి, దేశరక్షణ కోసం ప్రధాని మోదీ సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు నాయకులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా గ్రామస్థాయిలో పార్టీ బలోపేతమవుతుందన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ నాయకులు సత్తాచాటాలని సూచించారు. నూతన కమిటీ సభ్యులకు ఆయన నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, రమేశ్‌, గణేశ్‌, రాజేందర్‌, రాఘవేందర్‌, ఎల్లయ్య, హరిబాబు, రాము, దశరథ్‌, శ్రీశైలం, మహేందర్‌రెడ్డి, రాజు, వెంకటేశ్‌, నవీన్‌, పండగ శ్రీకాంత్‌, గుంటి నవీన్‌, శేఖర్‌, శివకుమార్‌, కిరణ్‌కుమార్‌, ఈశ్వర్‌, భరత్‌, మహేశ్‌, సాయికుమార్‌, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

ఫరూఖ్‌నగర్‌ మండలంలో..

ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని హాజిపల్లి, కిషన్‌నగర్‌, రాసుమళ్లగూడ, నాగులపల్లి, లింగారెడ్డిగూడ గ్రామాల్లో మంగళవారం బీజేపీ గ్రామ నూతన బూత్‌ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయ గ్రామాల బూత్‌ కమిటీ అధ్యక్షులుగా ఇస్నాతి మహేందర్‌, పాత్లావత్‌ వెంకటేశ్‌, రామకృష్ణ, గడ్డం మల్లేశ్‌, విష్ణువర్ధన్‌రెడ్డి, శివకుమార్‌ ఎన్నికయ్యారు. కార్యక్రమాల్లో నాయకులు మిద్దె గణేశ్‌, ఇస్నాతి శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కండి

కొందుర్గు: త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలకు అందరూ సిద్ధం కావాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి అన్నారు. జిల్లేడ్‌ చౌదరిగూడ మండలం వీరన్నపేట గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బూత్‌ కమిటీలను ఎన్నుకున్నారు. అనంతరం భూపాలచారి మాట్లాడారు. త్వరలో బీజేపీ మండలస్థాయి, గ్రామస్థాయి కమిటీలు పూర్తిచేసి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషిచేయాలన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో పోటీచేసి సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు కుర్మయ్య, నాయకులు శివ, మహేశ్‌, శేఖర్‌, శ్రీశైలం, నరేశ్‌ పాల్గొన్నారు.

వివరాలు సక్రమంగా నమోదు చేయాలి

ఎంఈఓ వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ వెంకటయ్య

మొయినాబాద్‌రూరల్‌: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పూర్తి వివరాలను ఆధార్‌కార్డు అనుసంధానం చేస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈఓ వెంకటయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఎన్‌టీఆర్‌ విద్యాసంస్థల్లోని సమావేశ మందిరంలో మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలల హెచ్‌ఎంలతో ఎంఈఓ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అన్ని విద్యాసంస్థలకు సంబంధించిన విద్యార్థుల పూర్తి సమాచారం కోసం ఆన్‌లైన్‌ అప్‌లోడ్‌ నిర్వహిస్తుందని సూచించారు. అందులో భాగంగా అపార్‌ పేరుతో సంపూర్ణ బయోడేటా కోసం ఆధార్‌ అనుసంధానం బట్టి ఆధార్‌లో ఎలాంటి పేర్లు ఉన్నాయో వాటినే సంక్షిప్తంగా అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లో ఆన్‌లైన్‌ చేయాలని సూచించారు. తప్పులు లేకుండా సక్రమంగా ఆన్‌లైన్‌ డేటాను పూర్తిచేసేందుకు కృషి చేయాలన్నారు. అదే విధంగా ఏదైనా సమస్యలు తలెత్తితే మండల విద్యా కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు మల్లయ్య, లక్ష్మారెడ్డి, అరుణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌ యాజమాన్యాలపై చర్యలు తీసుకోండి

సేవా ఫౌండేషన్‌ అధ్యక్షుడు నరేశ్‌

శంకర్‌పల్లి: ప్రైవేట్‌ పాఠశాలలు, కళాశాలల్లో అధిక ఫీజు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సేవా ఫౌండేషన్‌ అధ్యక్షుడు నరేశ్‌ అన్నారు. ఈ మేరకు మంగళవారం శంకర్‌పల్లి విద్యాశాఖ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని చాలా పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలు అమలు కావడం లేదన్నారు. దీనిపై వెంటనే విద్యాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి, తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్‌ ఉపాధ్యక్షుడు జైరాంరెడ్డి, సభ్యులు వేణేంద్రచారి, రవి, ధీరజ్‌ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫుడ్‌ ఫెస్టివల్‌



వంటకాలను పరిశీలిస్తూ విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ, ఎంఈఓ

కొత్తూరు: జంక్‌ఫుడ్‌ ఎక్కువగా తీసుకునే చిన్నారులు తరచూ అనారోగ్యాల బారిన పడేందుకు అవకాశాలు ఉన్నాయని సీఐ నర్సింహారావు అన్నారు. పట్టణంలోని ఎస్‌వీఆర్‌ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఫుడ్‌ ఫెస్టివల్‌ కార్యక్రమంలో ఆయన ఎంఈఓ అంగూర్‌నాయక్‌తో కలిసి పాల్గొన్నారు. ఇందులో భాగంగా వారు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తయారు చేసిన వంటకాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణతో విద్యార్థుల్లో పోషకాహారాలపై అవగాహన పెరుగుతుందని, వారు పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్‌ వీరమోని దేవేందర్‌ముదిరాజ్‌, ఏహెచ్‌ఎం భవాని, ఉపాధ్యాయులు, ఎస్‌ఐలు శ్రీనివాస్‌, మురళీగౌడ్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌ కమిటీలో చేవెళ్ల వాసులకు అవకాశం



కుర్వ పాండు



లక్ష్మారెడ్డి

చేవెళ్ల: ప్రభుత్వం హైదరాబాద్‌లోని గుడిమల్కాపూర్‌ మార్కెట్‌ కమిటీ నూతన పాలకవర్గాన్ని మంగళవారం ప్రకటించింది. ఈ పాలకవర్గంలో చేవెళ్లకు చెందిన లక్ష్మారెడ్డికి, తంగడపల్లికి చెందిన పాండులకు డైరెక్టర్లుగా అవకాశం లభించింది. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి, పాండు మాట్లాడుతూ.. తమకు మార్కెట్‌ కమిటీలో అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కాలె యాదయ్యకు, ఎంపికకు కృషి చేసిన కాంగ్రెస్‌ పార్టీ నాయకులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.